# లింకేస్

తోలేటి జగన్మోహనరావు

నేను న్యూఢిల్లీ స్టేషన్లో తమిళనాడు దిగి నా బ్యాగ్ పట్టుకుని బయటకు నడుస్తుంటే బరువుగా ఒక చెయ్యి నా కుడిభుజం మీద పడింది. నేను ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాను. ఖాదీ పంచె, ఖాదీ చొక్కా, పైన ఉత్తరీయం- సినిమాల్లో క్రిమినల్-పొలిటీషియన్‌లా వున్న ఒక ఆజానుబాహుడు దర్శనమిచ్చాడు. ఆయన గారికి అటూ ఇటూ ఇద్దరు గన్‌మెన్‌లు.

నేను తెల్లమొహం వెయ్యడం చూసి "గురుపట్టలేదా?" అన్నాడు ఆజానుబాహుడు భుజం చనువుగా గట్టిగా నొక్కుతూ. నాకు గన్‌మెన్‌లతో తిరిగే వి.ఐ.పి. స్నేహితులెవరూ లేరు. అంచేత గుర్తుపట్టడమనే సమస్య లేదు.

"మీరు పొరపడ్డారు. బహుశా ఎవరినో చూసి ఎవరో అనుకుంటారు" అన్నాను వినయంగా.

"నిన్నెలా మర్చిపోతాను అంజీ?" అన్నాడు ఆ పెద్దమనిషి నవ్వుతూ.

నన్ను నా నిక్‌నేమ్ పెట్టి చనువుగా పిలవడంతో



నేను మళ్లీ ఉలిక్కిపడ్డాను. గురుడు మనకు తెలుసున్నవాడే అయి ఉంటాడు. ఆయన అలా చనువుగా అంజీ అంటే నేను కూడా పగలబడి నవ్వి చనువుగా భుజంమీద చెయ్యి వేద్దామనుకున్నాను కానీ ఆయన ఆరడుగులెత్తు. అంచేత ఆయన చెయ్యి మాత్రం పట్టుకున్నాను నవ్వుతూ- ఆయనెవరో గుర్తుకు రాకపోయినా. గన్‌మెన్‌లు అటూ ఇటూ నడుస్తుండగా మేమిద్దరం చేతులు కలిపి నడవసాగాం. నడుస్తూ ఆలోచిస్తున్నా కానీ ఆ వ్యక్తి ఎవరో గుర్తుకు రావడం లేదు.

ఎక్కడుంటున్నావు అనడిగాడు ఆయన స్టేషను బయట కార్ పార్కింగ్‌కు చేరిన తర్వాత.

"గోల్ మార్కెట్ దగ్గర..."

"అరె! పక్కనేనన్నమాట. నేను నార్త్ ఎవెన్యూలో...

## డబ్బు

ఉన్నవాడి పెళ్లి ఊరేగుతున్నా
లేనివాడి శవం లేపలేకున్నా
అనుబంధాలు అడవి పాలవుతున్నా
కృత్రిమ కాగితాల(డబ్బు) కుతంత్రమే
మానవ మనుగడను మట్టిపాలు చేసేది

## సౌభ్రాతృత్వం

సమైక్య జీవనమే
సమాజ పురోగమనం
సమాజ పురోగమనమే
జాతి జీవన గమనం
జాతి జీవన గమనమే
విశ్వమానవ సౌభ్రాతృత్వం

## ఆరని జ్వాల

హరిత విప్లవాలు హరించుకుపోయినా
నీలి విప్లవాలు నింగికెగసినా
పారిశ్రామిక విప్లవాలు ప్రభంజనం లేపినా
సాంకేతిక విప్లవాలు సందుల్లో చొచ్చినా
దారిద్ర్య విప్లవం దహించుకుపోలేదు... ఏమా?

## రాచపుండు

నా దారిద్ర్యపు రాచపుండుపై
క్యాప్టలిస్టులు ఎప్పుడూ
కారం చల్లుతూనే ఉన్నా
రాజకీయ రాబందులు అప్పుడప్పుడు
పొడుచుకు తింటూనే ఉన్నా
ఐ.ఎం.ఎఫ్. అరువు
టానిక్ అందిస్తూనే ఉన్నా
కమ్యూనిస్టు వైద్యులు
కట్టుకడుతూనే ఉన్నా
దారిద్ర్యపు పుండు యేబది ఐదు ఏళ్లుగా
పెరుగుతూ ఉందే కాని తగ్గటం లేదు

## గుట్టు రట్టు

బంజారుల బంగరు భూమిని
బహు చవకగా బదలాయించి
బెంజి కారులో తిరిగే బడా వ్యాపారి
బంజారాహిల్స్‌లోని నేటి భాగ్యవంతులు

## నీవెవరు?

సమాజమనే మహావృక్షంపై
మనమంతా ఎవరికి వారే ఏకాకులం

– శిల్పా జగదీష్

పక్కనే ఉన్నా... తస్సాదియ్యా... ఎప్పుడూ కలవలేదే... పద... దారిలోనే కదా... మీ ఇంటి దగ్గర దింపుతా..." అన్నాడు పెద్దమనిషి.

పెద్దమనిషి నార్త్ ఎవెన్యూ అనగానే నేను కొంచెం దూరం జరిగాను. నార్త్ ఎవెన్యూ ఎంపీలు లాంటి వి.ఐ.పి.లుండే ఎవెన్యూ. నన్ను పేరుపెట్టి పిలిచినా బహుశా పెద్దమనిషి పొరపాటు పడ్డాడేమో అని మళ్లీ అనిపించి చేతులు మెల్లగా ఆయనగారి మీంచి తప్పించాను.

"ఇంతకీ గుర్తుపట్టావా లేదా?" అన్నాడు పెద్దమనిషి పెద్దగా నవ్వుతూ.

నేను సణిగాను.

"పోనీ హైద్రాబాద్‌లో పాపారావు పేరు ఎప్పుడైనా విన్నావా?"

"మీరు... పాపారావువా? పాపీ, నిన్ను గుర్తు పట్టలేకపోయానురోయ్" అన్నాను నేను సంతోషంగా.

"ఇప్పటికి గుర్తొచ్చిందన్నమాట..." అన్నాడు పాపారావు నా తలమీద ఒకటిచ్చుకుని పకపక నవ్వుతూ.

ఇంతలో గోల్ మార్కెట్ వచ్చింది. నేను కారు ఆపుచెయ్యమని దిగాను– "ఇక్కడే ఉండేది... ఎప్పుడైనా, తీరికైనప్పుడు, మా ఇంటికి రా..."

"తప్పకుండా..." అంటూ పాపారావు నార్త్ ఎవెన్యూ వెళ్లిపోయాడు. నేను ముప్ఫయి సంవత్సరాలు వెనక్కు హైద్రాబాద్ వెళ్లిపోయాను.

ముప్ఫయి సంవత్సరాల క్రితం ఆంజనేయులు ఇప్పటి ఆంజనేయులులా ఉండేవాడు కాదు. వాడు యవ్వనంతో పొగరుగా ఉండేవాడు. ఈ ప్రపంచాన్ని మార్చేయాలన్న ఉత్సాహంతో ఉండేవాడు. ఒక గుద్దు గుద్ది కొండలు పగలగొట్టగలనన్న ధీమాతో ఉండేవాడు. అలాంటి ఆంజనేయులుకి శ్రీరామచంద్రమూర్తి లాంటి ఆరాధ్య దైవం పాపారావు.

నక్సల్‌బరీ శ్రీకాకుళం దేశాన్ని ఊపేసిన రోజులవి. దేశంతోపాటు మేమూ ఊగిపోయాం. వసంతకాలం మేఘం గర్జించింది అంది పెకింగ్ రేడియో. కాబోలనుకున్నాం మేం.

పాపారావు కమ్యూనిస్టు ఫ్యామిలీ నుంచి వచ్చినవాడు. వాళ్ల నాన్న నైజాం వ్యతిరేక తెలంగాణా పోరాటంలో చురుగ్గా పనిచేశాడు. ప్రస్తుతం ఆయన గుంటూరులో పెద్దఎత్తున పొగాకు వ్యాపారంలో ఉన్నాడు. కమ్యూనిస్టు నేపథ్యం నుంచి వచ్చినవాడు కాబట్టి సహజంగానే పాపారావు మా సెల్‌కి లీడరు అయ్యాడు. మా సెల్‌లో నేనూ, పాపారావు కాక మరో ఇద్దరుండేవారు– పీటర్ రఘురాం, గోపాలం.

పీటర్ రఘురాం, నేనూ నరసాపురం కాలేజీలో కలిసి చదువుకున్నాం. ఆ తర్వాత ఇద్దరం ఒకే ఆఫీసులో జాయినయ్యాం. ఒరే! ఒరే! అనుకునే చనువు ఉంది మా మధ్య. అసలు పీటర్ రఘురాం ద్వారానే పాపారావు పరిచయం అయ్యాడు. నాకు విప్లవ రాజకీయాల పరిచయం కూడా పీటర్ రఘురాం ద్వారానే. వాడు హరిజన కుటుంబం నుంచి వచ్చాడు. తండ్రి మతం తీసుకుని క్రిస్టియన్ అయ్యాడు. తల్లీ, తండ్రీ ఇంట్లో అందరూ గవర్నమెంటు ఉద్యోగాలు చేస్తుండేవారు. పీటర్ రఘురాం పరిస్థితి ఆర్థికంగా చాలా బాగానే ఉన్నా హరిజనుల పట్ల సమాజంలో వివక్షత మాత్రం వాడిని గాయపరుస్తుండేది.

గోపాలం లాలాగూడలో ఎక్కడో వర్క్‌షాపులో రోజు కూలీకి పనిచేస్తుండేవాడు. అతను ఎక్కువ మాట్లాడేవాడు కాదు. ఎర్రగా చింతనిప్పుల్లాంటి కళ్లతో, ఎండిన శరీరంతో ఉండేవాడు. అతను పసితనం నుంచీ హోటల్లో కప్పులు కడిగీ, మార్కెట్లో మూటలు మోసీ కుటుంబాన్ని పోషించేవాడుట. తండ్రి కుటుంబాన్ని వదిలి మళ్లీ పెళ్లి చేసుకున్నాడట. తల్లీ, చెల్లీ కూడా ఏదో కూలి పనులు చేస్తుండేవారు. వాళ్లకి తినడానికే కష్టంగా ఉండట. అంతకంటే అతన్ని గురించి వివరాలు నాకు తెలియవు – పాపారావు చెప్పలేదు.

ఆ కాలంలో పాపారావు నలిగిపోయిన, చిరిగిపోయి, మాసిపోయిన బట్టలు వేసుకుని, జుట్టు దువ్వుకోకుండా చింపిరి చింపిరిగా ఉండేవాడు. గెడ్డం సరిగా గీసుకోకుండా ముళ్లపొదలా పెంచేవాడు. కాలేజీ రోజుల్లో పీటర్ రఘురాం దేవానంద్ హెయిర్ స్టయిల్‌తో ఫోజు కొట్టినా, పాపారావు ప్రభావం పడ్డాక అతనిలాగే ముళ్లకంప లాంటి గెడ్డం పెంచడం మొదలుపెట్టాడు.

పాపారావు, పీటర్ రఘురాం నీళ్లల్లో చేపల్లా విప్లవ రాజకీయాల్లో కలిసిపోయినా నేను మాత్రం కొంగలా పైపైన అడుగు లేస్తుండేవాడిని. నేను వట్టి కొంగను కాను, దొంగ కొంగని అని అనుమానం ఉండడం వల్ల కూడా వాళ్లలాగా మనస్ఫూర్తిగా విప్లవ రాజకీయాల్లో దిగలేకపోయాను. నేను అగ్రకులం వాడినే కానీ పేద కుటుంబం నుంచి వచ్చాను. ఉద్యోగంలో చేరాక నా పరిస్థితి బాగానే ఉన్నా, దారిద్ర్యం కారణంగా నేను చిన్నప్పుడు పొందిన అవమానాలు నన్ను ఎప్పుడూ కలత పెడుతూ ఉండేవి. ఆ కారణంగా నేను డబ్బున్న వాళ్లను ద్వేషించేవాడిని. విప్లవం పట్ల నేను సానుభూతితో ఉండడానికి కారణం అది.

కానీ రెండు పూటలా పీకలదాకా మెక్కి, నలగని ఇస్త్రీ మడతలేసి, విప్లవాల గురించి మాట్లాడడం ఇబ్బందిగా ఉండేది నాకు.

నాకు పెట్టీ బూర్జువా మనస్తత్వం పోలేదనీ, నేను డి–క్లాసు అయి కార్మికవర్గ మనస్తత్వం అలవరచుకోవడం లేదనీ విమర్శిస్తుండేవాడు పాపారావు. పాపారావు విమర్శ నూటికి నూరుపాళ్లు నిజమని నాకు తెలుసు కానీ కాళ్లు నిలదొక్కుకున్న వర్గ మనస్తత్వమే కానీ కార్మికవర్గ చైతన్యం అలవడలేదు నాకు.

పాపారావు లిబరేషన్ పత్రిక, పార్టీ రహస్య సర్క్యులర్లు తీసుకొచ్చి చదివి వినిపిస్తుండేవాడు. అప్పుడప్పుడు సెల్ సమావేశాలకు చండ్ర పుల్లారెడ్డి, దేవులపల్లి లాంటి అండర్ గ్రౌండ్‌లో వున్న నాయకుల్ని తీసుకొస్తూ ఉండేవాడు. ఇదంతా నాకు థ్రిల్‌గా ఉండేది.

చారు మజుందార్ గారు శత్రువు రక్తంలో చెయ్యి తడపనివాడు విప్లవకారుడు కాదన్నాడు. పాపారావు, పీటర్ రఘురాం ఇద్దరూ విప్లవకారులని రుజువు చేసుకోవలసిన సమయం వచ్చింది. ఒకరోజు రాత్రి సెల్ సమావేశం ఏర్పాటు చేసి పాపారావు చారు మజుందార్ గారి పంథా వివరించాడు. నేను విప్లవానికి పనికిరానని వాళ్లు అనుకుంటున్నారు కాబట్టి నాకు అంతకంటే ఎక్కువ చెప్పలేదు. కానీ నేను తర్వాత తెలుసుకున్న దేమిటంటే, పాపారావు నాయకత్వాన ఓ పదిమంది వరంగల్ దగ్గర అడవిలో సమావేశమై వర్గశత్రువుని ఖతం చెయ్యాలని

నిర్ణయించారు. ఏదో గ్రామంలో భూస్వామిని ఖతం చేసి, వాడి రక్తంలో చేతులు ముంచి గోడల మీద ముద్రలు వేసి, "విప్లవం వర్ధిల్లాలి" అని అరిచి హైద్రాబాద్ పారిపోయి వచ్చేశారు. పారాణి తడి ఆరకుండానే వైధవ్యం అన్నట్లు చేతుల రక్తం తడి ఆరకుండానే మొత్తం దళంతో పోలీసులకు పట్టుబడ్డారు పాపారావు, పీటర్ రఘురాంలు.

పాపారావు మాకు గెరిల్లా యుద్ధతంత్రం బోధిస్తూ, దళం దాడి సఫలమైనా, విఫలమైనా దళం తప్పించుకు పోవడానికి ఎస్కేప్ రూట్ ఒకటి జాగ్రత్తగా ఆలోచించి ఉంచుకోవాలి అంటూండేవాడు. విప్లవ నాయకుడు పాపారావు అలా ఎస్కేప్ రూట్ ఒకటి ఉంచుకున్నాడన్న విషయం నాకు తర్వాత అర్థమయింది. విప్లవం విజయవంతమైందా ఎర్రజెండాతో పాపారావు ముందు వరుసలో ఉంటాడు. విఫలమైందా క్షేమంగా బయటపడడానికి వయా గుంటూరు ఎస్కేప్ రూట్ ఉంచుకున్నాడు.

పాపారావు ఇలా అరెస్టయ్యాడో లేదో వాళ్ల నాన్నగారు గుంటూరు జిల్లాకి చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలను తీసుకుని బ్రహ్మానందరెడ్డి గారిని– ఆయన అప్పుడు ముఖ్యమంత్రో, హోంమంత్రో అనుకుంటా– కలుసుకుని పాపారావుని ఎన్‌కౌంటర్ చెయ్యకుండా కాపాడారు. పీటర్ రఘురాంకి అంత పలుకుబడి లేదు. వాడిని ఎన్‌కౌంటర్ చెయ్యలేదు కానీ చితకామతకా తన్ని జెయిల్లో పడేశారు పోలీసులు.

బుద్ధుడికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయం అయినట్లు కొందరికి జైలు గోడల మధ్య జ్ఞానోదయం అవుతుంది. లాఠీ దెబ్బలకి కళ్లు తెరుచుకుని బుర్ర చురుగ్గా పనిచెయ్యడం మొదలుపెడుతుంది. "నేనెవర్ని? ఇక్కడకు ఎందుకు వచ్చాను? అసలు విప్లవం నాకెందుకు?" అన్న ఆత్మవివేచన మొదలవుతుంది.

పాపారావు విప్లవాలకు నాయకత్వం వహించి నడపడానికే కానీ ఆదిలోనే హంసపాదు అన్నట్లు మొదట్లోనే ఇలా కేసులో ఇరుక్కుని జీవితాంతం జైలులో గడిపెయ్యడానికి సిద్ధంగా లేడు. బతికుంటే గుంటూరులో హాయిగా పొగాకు వ్యాపారం చేసుకోవచ్చు అనుకున్నాడు కాబోలు కేసు నుంచి బయటపడ్డాక విప్లవ రాజకీయాల నుంచి అదృశ్యమయ్యాడు.

పీటర్ రఘురాంకి పోలీసుల తన్నుల కంటే కుల వివక్షత– అగ్రకులం వాళ్లు తమ వాడినే కాపాడి తన సంగతి పట్టించుకోకపోవడం చాలా బాధ కలిగించింది. చివరకు ఇద్దరు హరిజన ఎమ్మెల్యేలు, ఒక హరిజన మంత్రిణి గార్ల సహాయంతో కేసు నుంచి బయటపడ్డాడు. దానితో మార్క్స్ కంటే అంబేద్కర్ గారు చాలా పవర్‌ఫుల్ అని వాడికి జ్ఞానోదయమై, "జై భీమ్" అని కొత్త నినాదం అందుకున్నాడు.

నాలో పెట్టీ బూర్జువా గాడు "హాయిగా నీ ఉద్యోగం నువ్వు చేసుకోక ఎందుకురా నీకీ గొడవ?" అని వార్నింగ్ ఇస్తూనే ఉన్నాడు మొదటినుంచీ. అయినా విప్లవం నాకు ఒరగబెట్టేదేముంది? అప్పుడు కూడా పని చెయ్యాలి కదా! ఆ మాత్రం దానికి ఇప్పుడు వీపులు పగలగొట్టించుకోవడం దేనికి అని నాకూ సంపూర్ణ జ్ఞానోదయం అయింది.

మా ముగ్గురి కథలు సుఖాంతమయ్యాయి కానీ మా సెల్‌లో నాలుగవ వ్యక్తి– గోపాలం కేసులోంచి బయటపడ్డ తర్వాత అడవుల్లో కలిసిపోయాడు. అతను మాలాగా లాభనష్టాలు బేరీజు వేసుకున్నాడో లేక జీవితం చావూ ఒకటే అనుకున్నాడో తెలియదు కానీ అతను చివరిదాకా విప్లవంలోనే ఉన్నాడు. అయిదారేళ్ల తర్వాత అతన్ని ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడో ఎన్‌కౌంటర్లో పోలీసులు కాల్చేశారని విన్నాను.

★ ★ ★

పాపారావు నన్ను మరచిపోలేదు. రెండు వారాల తర్వాత ఆదివారం వాళ్లింటికి రమ్మని ఫోన్ చేశాడు. నార్త్ ఎవెన్యూలో పాపారావు ఫ్లాట్‌కి వెళ్లాను.

పాపారావు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నాడో నాకు తెలియదు. తెలుగుదేశం, కాంగ్రెస్, సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం) లేక బీజేపీ – నాకు తెలుసుకోవాలని ఆసక్తీ లేదు. గులాబీ ఏ పేరుతో పిలిచినా గులాబీయే అయినట్లు, పాపారావు ఏ పార్టీలో ఉన్నా పాపారావే.

నేను వెళ్లేటప్పటికి హాలులో పాపారావు కాక గొడిగేదెలా నల్లగా నిగనిగలాడుతున్న మరొక వ్యక్తి కూడా ఉన్నాడు. నేను హాలులో అడుగుపెట్టగానే అతను మాట్లాడకుండా నన్ను పరిశీలనగా చూడడం మొదలుపెట్టాడు. అతనికి వినయంగా నమస్కారం చేసి కూర్చున్నాను.

"నన్ను కూడా గుర్తుపట్ట లేదన్నమాట" అన్నాడు అతను నేను హాలులో అడుగుపెట్టిన రెండు నిముషాల తర్వాత.

మనిషి గుర్తు తెలియకపోయినా గొంతు పరిచయమైనట్లే అనిపించింది. "పీటర్ రఘురాం?"– కొంచెం సందేహంగా అన్నాను.

"గుర్తుపట్టావన్నమాట" అని చాలా సంతోషించాడు పీటర్ రఘురాం– "పాపీ, నేనూ తరచూ కలుసుకుంటూనే ఉన్నాం. నీ గురించే తెలియలేదు. పోయావేమో అనుకున్నా. బతికే ఉన్నావన్నమాట. సంతోషం. చాలాకాలం తర్వాత పాత మిత్రులం అందరం కలుసుకున్నాం."

"నువ్వెలా వచ్చావు ఇక్కడికి?"

"ఇక్కడ కాన్షీరాం గారి దళిత సమావేశానికి వచ్చాను. ఎలాగూ వచ్చాను కదా అని మనోడిని ఒకసారి చూసి పోదామని వస్తే నువ్వు కూడా వస్తున్నావని చెప్పి ఉండిపొమ్మన్నాడు..." అన్నాడు. పాపారావంటే పాత కోపం ఏవీ ఉన్నట్లు కనిపించలేదు. ఇద్దరూ ఏవీ జరగనట్లే ఛలోక్తులు వేసుకుంటూ మాట్లాడుతున్నారు.

మేం అలా మాట్లాడుకుంటుంటే "నమస్కారం" అంటూ లోపల నుంచి మధ్య వయస్కురాలు ఒకావిడ వచ్చింది.

"ఈవిడ... జమునారాణి..." అని పరిచయం చేశాడు పాపారావు.

ఆవిడని ఎప్పుడూ చూడలేదు కానీ ఆవిడ గురించి మాత్రం చాలా విన్నాను.

ఆవిడ కూడా పాపారావులా కృష్ణా జిల్లా ధనిక కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చినదే. ఉస్మానియా యూనివర్సిటీలో స్టూడెంట్ యూనియన్‌లో ఉండి విప్లవ కార్యక్రమాల్లో చాలా చురుగ్గా పనిచేసింది. ఆవిడా, ఆవిడ బృందం "మావో జిందాబాద్", "చైనా చైర్మన్ మన చైర్మన్" లాంటి నినాదాలు గోడల మీద రాసేవారు. "విప్లవం వర్ధిల్లాలి" అని గొంతు చించుకు అరిచేవారు. కానీ ఎంత అరిచినా విప్లవ సూర్యోదయం కాలేదు. తూరుపు దిక్కు ఆవిడ ఆశించినట్లు అరుణ కాంతులతో ధగధగలాడలేదు.

అయితే తూర్పునే సూర్యోదయం కావాలని ఏముంది? సూర్యోదయం పడమట కూడా అవుతుంది. పడమట దిక్కున ఫెమినిస్టు సూర్యోదయం కాగానే ఆవిడ పొద్దుతిరుగుడు పువ్వులా దిక్కు మార్చి రాత్రికి రాత్రి ఫెమినిస్టు అయిపోయింది. మార్క్స్‌ని సమాధి చేసి, చలాన్ని సమాధి నుంచి లేపి స్త్రీ స్వేచ్ఛ అంటూ ఆంధ్రదేశమంతా ఊరేగించి, నలుగురి కళ్లల్లోనూ, పదిమంది నోళ్లలోనూ పడి గుర్తింపు తెచ్చుకుంది. పత్రికలలోనూ, ప్రజలలోనూ బాగా పాపులర్ అయింది. అర్థరూపాయెత్తు బూతు, అర్థరూపాయెత్తు నీతి కలిపి సంచలన కవిత్వం రాసి గొప్ప 'కవిగా పేరు తెచ్చుకుంది. అమెరికన్ యూనివర్సిటీల్లో రెండేళ్లుండి 'తెలంగాణా పోరాటంలో, విప్లవోద్యమాలలో స్త్రీలపై లైంగిక వేధింపులు' అన్న అంశం మీద పరిశోధన చేసింది. ప్రస్తుతం ఆవిడ స్త్రీలకు సంబంధించిన ఏదో ఎన్జీవో నడుపుతూ, ప్రపంచంలో నలుమూలలా ఫెమినిస్టు సమావేశాలకు హాజరవుతూ పురుష దురహంకారాన్ని ఖండిస్తూ చాలా బిజీగా ఉంది.

దళితులూ, స్త్రీలూ ఒకటే అంటుంది జమునారాణి.

## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం–

పత్రిక విడిప్రతి : 5/-

ప్రత్యేక సంచిక (ఉగాది, దీపావళి) :10/-

సాలుసరి చందా :60/-

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

మోనికా పబ్లికేషన్స్
79బి, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–33.

దళితులూ, స్త్రీలూ ఒకటి అవునో కాదో నాకు తెలియదు కానీ పీటర్ రఘురాం, జమునారాణి ఒక జాతికి చెందినవారే- సందేహం లేదు.

"నమస్కారం... మీరూ ఇక్కడే ఉంటారా?" అన్నాను ఆవిడని పలకరింపుగా.

"లేదండి. రేపు బీజింగ్‌లో ఇంటర్నేషనల్ విమెన్స్ కాన్ఫరెన్స్‌కి వెడుతున్నాను. ఫ్లయిట్ తెల్లవారకట్ల. మన పాపారావు ఉన్నాడు కదా అని వచ్చాను..." అంది జమునారాణి.

"ఏం తీసుకుంటావు అంజీ..." అన్నాడు పాపారావు- రామచంద్రులవారు ఆంజనేయస్వామి వారిని అభిమానంగా, ప్రేమతో అడిగినట్లు.

"మీరేం తీసుకుంటే అది..."

"మేం తీసుకునేది నువ్వు తీసుకోలేవులే..." పీటర్ రఘురాం వేళాకోళంగా అన్నాడు.

"ఎందుకు తీసుకోలేనూ... తీసుకుంటా..."

"అయితే, విస్కీ... రమ్...?"

"ఏదైనా సరే..."- నాకు డ్రింక్ అలవాటు లేదు కానీ పీటర్ రఘురాం రెచ్చగొట్టినట్టు అడిగితే సరే అన్నాను.

పాపారావు విస్కీ, సోడా, ఐసు తీసుకొచ్చాడు. గ్లాసుల్లో పోసి నాకూ, పీటర్ రఘురాంకి చెరో గ్లాసు అందించి తనో గ్లాసు తీసుకున్నాడు. జమునారాణి ప్లేటులో జీడిపప్పు తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టి, ఏపిల్ జ్యూస్ గ్లాసు తీసుకు కూర్చుంది.

మాజీ కామ్రేడ్స్ అంతా ఒకచోట చేరేసరికి సహజంగానే పాత జ్ఞాపకాలతో కబుర్లు మొదలయ్యాయి.

మార్క్సిజం మానవ స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోలేదనీ, అందువలననే అది ఫెయిలయిపోయిందనీ అన్నాడు పాపారావు. ఓ గొప్ప సిద్ధాంతం మరణం పట్ల సంతాపం వ్యక్తపరిచాడు. పాపారావు వాక్చాతుర్యం చూసి నేను ఎప్పుడూ ఆశ్చర్యపోతాను. విప్లవం వీధిమొగలో నిలబడిందని అప్పుడు ఎంత కన్విన్సింగ్‌గా చెప్పాడో, అంత కన్విన్సింగ్‌గానూ మార్క్సిజం చచ్చిపోయిందని ఇప్పుడు చెప్పాడు.

మార్క్సిజం దళితులని తప్పుదారి పట్టించింది అనీ, ఇప్పుడు జరగవలసింది వర్గపోరాటాలు కాదు, వర్ణపోరాటాలని అన్నాడు పీటర్ రఘురాం.

మార్క్సిజం స్త్రీలను నిర్లక్ష్యం చేసిందనీ, ఫెమినిజం మాత్రమే స్త్రీలను విముక్తి చేస్తుందనీ అంది జమునారాణి.

నాకు వినే అలవాటే కానీ మాట్లాడే అలవాటు లేదు. నేను ఎప్పుడూ శ్రోతనే. అంచేత వాళ్లు మాట్లాడుతుంటే వింటూ, మరేం పని లేదు కనుక గ్లాసు ఖాళీ చేసేశాను. వాళ్ల గ్లాసులు సగం కూడా ఖాళీ కాలేదు.

"అదేవిటి అంజిబాబూ- మంచినీళ్లు తాగినట్లు తాగేస్తున్నావు- అది విస్కీ- రఘువ్మని నిషా అందుకుంటుంది" అన్నాడు పీటర్ రఘురాం.

"ఇంకో పెగ్గెయ్యి గురుడికి..." అన్నాడు పాపారావు నవ్వుతూ.

"వెయ్యమంటావా?" అన్నాడు పీటర్ రఘురాం విస్కీ నా గ్లాసులోకి వంచుతూ.

పాపి, పీటర్ మామూలుగానే ఉన్నా, నాకు కొంచెం కొంచెం నిషా ఎక్కుతోంది. పెంకిగా ఏదైనా దెబ్బలాట పెట్టుకోవాలని ఉంది.

"అంజీ! నువ్వు నోరువిప్పడం లేదేంటిరా?" అన్నాడు పీటర్ రఘురాం నన్ను రెచ్చగొడుతూ.

"మాట్లాడడానికేవుంది? నువ్వు చెప్పేది వింటున్నా చిట్టిబాబూ..."

"చిట్టిబాబా? వాడెవడురోయ్?"

"రావిశాస్త్రి గారి రాజు-మహిషి నవలలో నీలాంటి కేరెక్టర్..."

"గురుడికి నిషా ఎక్కింది..." పాపారావు నవ్వాడు.

"ఇవి ఎన్ని వేళ్లురా అంజీ?" అన్నాడు పీటర్ రఘురాం వాడి చెయ్యి నా కళ్లముందు ఆడిస్తూ.

"నాకేం నిషా ఎక్కలేదు. అంతా స్పష్టంగా కనిపిస్తోంది. నువ్వూ, నీ చెయ్యీ... అక్కడ సోఫాలో చిట్టిబాబు..."

"ఇందాక నన్ను చిట్టిబాబన్నావు?"

"నువ్వూ చిట్టిబాబువే... పాపీ చిట్టిబాబే..."

"మరి నువ్వు?"

"నేనూ చిట్టిబాబునే..."

"'నువ్వూ చిట్టిబాబువే... బావుంది... మరి ఈవిడ...'- పాపారావు జమునారాణిని చూపిస్తూ అన్నాడు.

"ఆవిడా? భాబీజీ... చిట్టిబాబీజీ..."

"ఏవిటి మాట్లాడుతున్నాడు ఇతను" అంది జమునారాణి చికాగ్గా.

"గురుడు గుర్రం ఎక్కాడు..." అన్నాడు పాపారావు పగలబడి నవ్వుతూ.

"నేను గుర్రం ఎక్కలేదు, గాడిదా ఎక్కలేదు. పూర్తి కంట్రోలులో ఉండి మాట్లాడుతున్నాను. నిషాలో మాట్లాడడం లేదు. ఇప్పుడు ఏం మాట్లాడినది వారం రోజుల తర్వాత నిద్రలేపి అడిగినా చెబుతాను. ఛాలెంజ్..."

"నీకు నిషా ఎక్కలేదు కానీ మాట్లాడు... అంతా సైలెంటుగా ఉండాలి... అంజి మాట్లాడుతాడు... అన్నాడు పీటర్ రఘురాం"- వాడి గొంతులో వేళాకోళం నాకు తెలియకపోలేదు. ఆ పరిహాసం పట్టించుకోకుండా మాట్లాడడం మొదలుపెట్టాను.

"మైడియర్ మాజీ కామ్రేడ్స్! ఇప్పుడు నేను కొంచెం సీసా బద్దలుకొట్టి నిర్మొహమాటంగా మాట్లాడబోతున్నాను. మీ మొహాలు పగిలితే ఏవనుకోకండి..."

"అంజి ఉపన్యాసం ఇవ్వబోతున్నాడు. బల్ల ఎక్కించు..." అని పాపి కన్నుగీటాడు పీటర్ రఘురాంకి. వాడు నా చెయ్యి పట్టుకుని లేపి బల్ల ఎక్కించాడు.

"మైడియర్ మాజీ కామ్రేడ్స్! మార్క్సిజం చచ్చిపోలేదు. హత్య చెయ్యబడింది. ప్రపంచంలో అన్ని కమ్యూనిస్టు పార్టీల్లోనూ ఉన్న మనలాంటి రంగురంగుల చిట్టిబాబులు వెన్నుపోటు పొడిచి హత్య చేశారు. పాపారావు ఇందాక ఏంటి అన్నాడు?"

"నేనేవీ అనలేదురా బాబూ"

"... మనం డి-క్లాస్ అవ్వాలి అని ఎవరన్నారు? ఎవరంటే ఏంలే? మనం డి-క్లాసు అవడం అబద్ధం. మనం పూసుకున్న ఎర్రరంగు గీకి పడేస్తే కాకుల్లా మనం తెల్లగా మనం అసలు రూపంలో బయటపడతాం..."

"... కాకులు నల్లగా ఉంటాయి నాయనా..."

"తెల్ల కాకులు కూడా ఉంటాయి, నీకు తెలియదేమో. నేను చెప్పేదేవిటంటే- ఇప్పుడు కాకుల గురించి మాట్లాడడం లేదు- పులి గురించి మాట్లాడుతున్నాను. పులి- చిరతపులి- మచ్చలు మార్చలేనట్లుగానే చిట్టిబాబులు డి-క్లాసు కాలేరు. వాళ్లు డి-క్లాసు కాలేరు కానీ నాయకత్వంలోకి చేరి కార్మికవర్గ పార్టీని డి-క్లాసు చేసేశారు. ఎర్రజెండా వాళ్ల చేతిలోకి రాగానే పింక్ జెండా- దగుల్బాజీల జెండా అయిపోయింది. దోపిడీ, పోరాటం, సోషలిజం, విప్లవం లాంటి నినాదాలు చిట్టిబాబుల నోట వస్తుంటే జనాలు అసహ్యించుకుంటున్నారు. మొహంమీద ఉమ్మేస్తున్నారు. సారీ... బాభీజీ... చిట్టిబాబీజీకి కోపం వస్తోంది... సమాజం కుళ్లిపోయింది కుళ్లిపోయింది అని మనం పాట పాడుతాం కదా... ఈ సమాజం కుళ్లిపోయిందనడానికి మనం ఒక నిదర్శనం. ఈ సమాజం కుళ్లిపోవడానికి మనమూ కారణం. ఈ కుళ్లులో ఎర్రరంగు పూసుకున్న మనమూ ఒక భాగం...

ఫెయిలయింది మార్క్సిజం కాదు, మార్క్సిజం ముసుగులో చలామణి అయిన చిట్టిబాబిజం. హలో గోపాలాలు... ఈ పోరాటం మీది. ఈ విప్లవం మీరు మీ కోసం చెయ్యవలసినది. నెత్తురుతో ఎర్రబడ్డ పేదల జెండా పేదల చేతుల్లోనే ఉండాలి. మీ జెండా మీ చేతుల్లోనే సగర్వంగా ఎగరనీయండి. పింకీగాళ్ల చేతుల్లో పెట్టి ఎర్రజెండా సిగ్గుపడేలా, జనాలు ఛీకొట్టేలా చెయ్యకండి. కుడి ఎడమల దగా... దగా... అన్నాడు శ్రీశ్రీ. కుడి నుంచి దగా మీకు తెలుసు కాని అయ్యో గోపాలాలూ... ఎడమ నుంచి ఎన్ని వెన్నుపోట్లు..."

"ఏవిటి పాపారావు ఈ తాగుమోతు గోల..."- జమునారాణి విసురుగా లేచి నిలబడింది. "అతను ఏం మాట్లాడుతున్నాడో అతనికి తెలియటం లేదు. ఇంక నోరు మూయించండి..."

"... భాభీజీ... చిట్టి భాభీజీకి... కోపం వచ్చింది..."

"సరేలే... ఇంక దిగు... మాట్లాడింది చాలు... నువ్వు స్పృహలో లేవు..." అన్నాడు పాపారావు కొంచెం విసుగ్గా.

"నాకేం కాలేదు... ఇప్పుడు ఏం మాట్లాడినది వారం రోజులు కాదు- పదమూడు రోజుల తర్వాత నిద్రలేపి నన్ను అడిగినా చెబుతా... ఛాలెంజ్... మాట్లాడొద్దా? మానేస్తా... ఉపన్యాసం ముగించేస్తా... ఇంక నన్ను బల్ల దింపేయ్..." అన్నాను పీటర్ రఘురాంకేసి చెయ్యి చాపి.

పీటర్ రఘురాం చెయ్యందించాడు.

"బల్ల దిగిపోయే ముందు ఇంకొక్క మాట చెప్పనా? చైనాలో... ఇంక మాట్లాడొద్దా... సరే! చైనా అంటే గుర్తొచ్చింది... బీజింగ్ బాభీజీ... మేడమ్ చింగ్ చింగ్ చాంగ్... చిట్టిభాభీజీ... ఏదీ?"

"నీ గోలకి ఆవిడ తలనొప్పి వచ్చి లోపల పడుకుంది కానీ ఇంక దిగు... నీ పరిస్థితి బాగాలేదు" అంటూ చెయ్యందించాడు పీటర్ రఘురాం.

"పడిపోయేలా ఉన్నానురోయ్ చిట్టిబాబూ... జాగ్రత్తగా పట్టుకో..."

పీటర్ రఘురాం చెయ్యందించి దింపబోతుంటే ధన్‌మని పడిపోయాను.

★ ★ ★

ఆ తర్వాత ఏం జరిగిందో నాకు గుర్తులేదు కానీ "ఈ వెధవ బుద్ధులు ఎప్పటినుంచి? ఇంకా నయం, ఏ బురదగుంటలోనో పడ్డారు కారు..." అంటూ మా ఆవిడ చివాట్లు వేస్తుంటే స్పృహ వచ్చింది.